ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం లాంటి ఓటు హక్కును ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా వినియోగించుకునేలా అవగాహన కల్పించడంతో పాటు ఏర్పాట్లు చేస్తున్నామని, ఫలితంగా వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని వరంగల్ పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, వరంగల్ కలెక్టర్ పి.ప్రావీణ్య స్పష్టంచేశారు. ఇక ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు చేసేందుకు, ఓటరుకు సహాయంగా ఉండేందుకు ప్రత్యేకంగా యాప్‌లను ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని, అలాగే 24గంటలు అందుబాటులో ఉండే కంట్రోల్‌రూమ్‌లను కూడా ఏర్పాటు చేశామన్నారు. పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు యంత్రాంగం అనుసరిస్తున్న ప్రణాళి గురించి ఆమె శనివారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: వరంగల్ లోక్‌సభ ఎన్నికల కోసం ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

కలెక్టర్ : మే 13న జరిగే పోలింగ్ నిర్వహణతో పాటు ప్రస్తుతం అమల్లో ఉన్న ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. వరంగల్ లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ, భూపాలపల్లి, పరకాల, స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి, వర్ధన్నపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిసి మొత్తం 18,16,500మంది ఓటర్లు ఉండగా, 1,899 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. వీటిలో 419 సమస్యాత్మక కేంద్రాలున్నట్టు గుర్తించాం. ఎన్నికల నిర్వహణ కోసం 10వేల మంది సిబ్బందిని సిద్ధం చేస్తున్నాం. 130శాతం ఈవీఎంలు, వీవీప్యాట్లు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే అన్ని ఈవీఎంల పనితీరును పరిశీలించాం. ఎక్కడా ఈవీఎంలు మొరాయించకుండా చర్యలు చేపట్టాం. పోలింగ్ సిబ్బంది రాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఓటింగ్ శాతం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలు గురించి?

కలెక్టర్ : ప్రతీ ఒక్కరు స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకుంటున్నాం. గత లోక్‌సభ ఎన్నికల్లో 63.7శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి ఆ పోలింగ్‌శాతాన్ని పెంచడంపైనే దృష్టి పెట్టాం. ఇప్పటికే పలు రూపాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు సంకల్ప్ పత్రాలు అందిస్తున్నాం. 340క్యాంపస్ అంబాసిడర్లు, ఓటర్ అవేర్నస్ ఫోరంలను ఏర్పాటు చేస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల కంటే వరంగల్ మహానగరంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటోంది. కానీ ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచడానికి చర్యలు తీసుకుంటున్నాం. మెప్మా సహకారంతో మహిళాసంఘాలతో సమావేశాలు నిర్వహిస్తున్నాం. ఓటర్లు పోలింగ్‌కు వచ్చేలా అవగాహణ కల్పిస్తున్నాం. అలాగే భూపాలపల్లి నియోజకవర్గంలోనే 10 నక్సల్స్ సమస్యాత్మక కేంద్రాలు, నాలుగు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. ఆయా ప్రాంతాల్లో ప్రశాంతంగా ఓటింగ్ జరిపించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ఫిర్యాదులు, సహాయానికి సంబంధించి..?

కలెక్టర్ : ఓటర్లకు 24గంటలపాటు అందుబాటులో ఉండేలా వరంగల్, హనుమకొండ, భూపాలపల్లి, జనగామ జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశాం. టోల్ ఫ్రీ నెంబరు 1950కి కాల్‌చేసి కూడా ఫిర్యాదులు చేయవచ్చు, సహాయం కూడా పొందవచ్చు. అలాగే సి-విజిల్ యాప్ ద్వారా కూడా ఎన్నికల సంబంధించిన ఫిర్యాదులు చేయొచ్చు. ఈ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రాజకీయ పార్టీల కోసం సువిధ యాప్ అందుబాటులో ఉంది. ఈ యాప్ ద్వారా ఎన్నికల ర్యాలీలు, సభలు, సమావేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అలాగే ఓటర్ల కోసం ఓటరు హెల్ప్ లైన్ యాప్ కూడా అందుబాటులో ఉంది.

ఆంధ్రజ్యోతి : ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీ అమలుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

కలెక్టర్ : వరంగల్ లోక్‌సభ పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాం. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలైన ఎఫ్‌ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ తోపాటు అకౌంట్స్ టీమ్స్, సెక్టార్ ఆఫీసర్ల నియామకం చేశాం. అలాగే పోలీసుశాఖతో కలిసి కీలకమైన ప్రాంతాల్లో తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఎన్నికల నియమావళిపై ఇప్పటికే రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించాం. పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, వాల్ రైటింగ్స్, పోస్టర్లు, ఫ్లెక్సీలు, ఫ్లాగ్స్ తొలిగిస్తున్నాం. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను, ఎంసీఎంసీ కమిటీలను ఏర్పాటు చేశాం. ప్రతీ ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియామవళిని పాటించాలి.

ఆంధ్రజ్యోతి : ఓటరు నమోదుకు ఇంకా సమయం ఉందా..?

కలెక్టర్ : అవును ఇంకా సమయం ఉంది. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదవ్వొచ్చు. గతంలో జనవరి 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారికే అవకాశం ఉంది. కానీ ఈసారి ఏప్రిల్ 1వ తేదీ వరకు 18ఏళ్లు నిండిన వారు అర్హులవుతారని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఏప్రిల్ 15 వరకు కొత్త ఓటరు నమోదుకు గడువున్న నేపథ్యంలో అవకాశాన్ని వినియోగించుకోవాలి. కొత్తగా ఓటు హక్కు పొందిన వారికి కూడా ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు ఏర్పాటు చేస్తున్నాం. అలాగే ఫాం- 18 ద్వారా చేర్పులు, మార్పులు చేసుకునే వారికి మార్చి 25వ తేదీ వరకు గడువుంది.

ఎంహెచ్ నగర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు

దాడి చేసిన పోలీసులు.. డాక్టర్, నర్సుపై కేసు

మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న స్కానింగ్ మిషన్

వరంగల్ మెడికల్, మార్చి 23: వరంగల్ దేశాయిపేట ఎంహెచ్ నగర్‌లో ఓ స్కానింగ్ సెంటర్‌పై పోలీసులు దాడి చేసినట్లు తెలిసింది. ఈ సెంటర్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు అందిన పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం ఓ మహిళా కానిస్టేబుల్‌తో పాటు మరో కానిస్టేబుల్ మఫ్టీలో వెళ్లినట్లు సమాచారం. మొత్తం స్కానింగ్ సెంటర్‌లో ఆ సమయంలో ముగ్గురు గర్భిణులు ఉన్నట్లు తెలిసింది. అనంతరం అక్కడ గర్భ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు నిర్ధారణకు వచ్చాక మఫ్టీలో ఉన్న పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు రంగ ప్రవేశం చేసి మొబైల్ స్కానింగ్ మిషన్ స్వాధీనం చేసుకోవడంతోపాటు వైద్యురాలు, నర్సును అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈలోగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారికి సమాచారం చేరవేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరుగుతున్నట్లు ధ్రువీకరించేందుకు డిప్యూటీ డీఎంహెచ్‌ఓతో కూడిన ఒక బృందాన్ని అక్కడికి పంపారు. ఈ బృందం కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరిపినట్లు ధ్రువీకరించారని విశ్వసనీయ సమాచారం. కాగా, ఈ స్కానింగ్ సెంటర్‌పై డిప్యూటీ డీఎంహెచ్‌వో గోపాలరావు ఇంతేజార్ గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వైద్యురాలు డాక్టర్ సబిత, నర్సు మాధవిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ పోలీసులు తెలిపారు.

శ్యామలచంద్రకు డాక్టరేట్

కేయూ క్యాంపస్, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకురాలు రొక్కల శ్యామలచంద్రకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు శ్యామల చంద్రకు డాక్టరేట్‌ను ప్రకటించినట్లు శనివారం ఓయూ పరీక్షల నియంత్రణాధికారి తెలిపారు. 'ఆ కంప్రెహెన్సివ్ స్టడీ ఆన్‌ద సింథసిస్ ఆప్ గమ్ కారయ బయో కంపోసిట్ సిల్వర్ నానోపార్టికలస్ అండ్ ఇట్స్ బయోలాజికల్ అపికేషన్స్' అనే అంశంపై ఓయూ బయో కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ కరుణ. రూపుల పర్యవేక్షణలో శ్యామల చంద్ర డాక్టరేట్ పూర్తిచేశారు. డాక్టరేట్ పొందిన శ్యామల చంద్రను పలువురు అభినందించారు.

మెడికల్ షాపు లైసెన్స్ సస్పెన్షన్

వరంగల్ మెడికల్, మార్చి 23: డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ రూల్స్ అతిక్రమించినందుకు కాజీపేట బాపూజీ నగర్‌లోని మెడ్ ప్లస్ లైసెన్సును ఏడు రోజులపాటు సస్పెన్షన్ చేసినట్లు హనుమకొండ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జె..కిరణ్ కుమార్ శనివారం తెలిపారు. ఒక ఔషధం అమ్మకంపై ఇన్ఫర్మేషన్ కొనుగోలు బిల్లు, సేల్స్ రిజిస్టర్ వివరాల కోసం ఔషధ నియంత్రణశాఖ నోటీసులు జారీ చేసింది. వివరణ సంతృప్తికరంగా లేకపోవడంతో డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ రూల్స్ చట్ట ప్రకారం ఏడురోజులు లైసెన్స్ రద్దు చేసినట్లు ప్రకటించారు.



చిలుపూర్‌లో ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా వెంకన్న రథోత్సవం

చిలుపూర్, మార్చి 23: మండల కేంద్రంలోని చిలుపూర్ గుట్ట బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏడవ రోజు శనివారం రథోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ఈవో బాగం లక్ష్మీప్రసన్న, ఉత్సవ కమిటీ ఛైర్మన్ మామిడాల యాదవరెడ్డి నేతృత్వంలో ఆలయ ప్రధానఅర్చకుడు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేపట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం గుట్ట దిగువన గల మాడ వీధులతో పాటు, చిలుపూర్ గ్రామంలోని పలు వీధుల గుండా రథాన్ని ఊరేగించి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు సంగోజు మోహనాచారి, గట్టు(దుబాయ్) ఎల్లయ్య, జక్కుల రాజశేఖర్, గాజుల రజిని, పుట్ట కిరణ్‌రెడ్డి, పుల్యాల నారాయణరెడ్డి, నాయకులు తీగల మహేందర్, గడ్డమీదిసురేశ్, దాతలు గుళ్ళపల్లి శ్రీనివాస్-భవాని, రఘువీర్, మాజీ ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, జూనియర్ అసిస్టెంట్ రమేష్, వీరన్న, వసంత, గాదె రాజశేఖర్, నారగోని రాజు, ఆకుల సాంబరాజు, గొల్లపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథుడి కల్యాణం



కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ ధర్మకర్త రంగాచారి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, మార్చి 23: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పురాతన శ్రీ తిరుమలనాథ స్వామి ఆలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితుల నేతృత్వంలో శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా కల్యాణం చేపట్టారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి పులకించారు. అంతకు ముందు ఎదుర్కోళ్ల కార్యక్రమం పూజారులు చేపట్టగా భక్తులు ఆనందోత్సాహాల మధ్య తిలకించారు. ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం హోమం, విష్ణు సహస్ర నామార్చన, గరుడ వాహన సేవ, తిరువీధి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు వరుణ్‌కుమారాచార్యులు, రఘునాథాచార్యులు, రాము, శేషాచారి, నరేష్, ఆలయ కమిటీ బాధ్యులు కలకోట రంగాచారి, యాద శ్రీనివాస్, ఎస్.ఆంజనేయులు, గన్ను శ్రీనివాస్, ఎంపీటీసీ నర్సింహులు, పాలకుర్తి సోమశేఖర్, తెల్లాకుల రామకృష్ణ, గోలి రాజశేఖర్, కొలికపాక సతీష్, వి.తిరుమల శ్రీనివాస్, గౌరిశెట్టి శ్రీనివాస్, నరేందర్, ఐత ప్రభాకర్, జి.రమేశ్, మహేష్, కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు 99.91 శాతం విద్యార్థుల హాజరు

జనగామ కల్చరల్, మార్చి 23 : జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలు సాఫీగా కొనసాగుతున్నాయి. విద్యార్థులకు శనివారం మ్యాథమెటిక్స్ పరీక్ష నిర్వహించారు. 6,698 మంది విద్యార్థులకు గాను ఆరుగురు గైర్హాజరు కాగా, 6,692 మందితో 99.91 శాతం విద్యార్థులు హాజరైనట్లు డీఈవో కె.రాము తెలిపారు. పరీక్షల సందర్భంగా ఘన్‌పూర్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సందర్శించారు. తరగతి గదులతో పాటు రికార్డులను పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ 13 పరీక్షా కేంద్రాలను, డీఈవో 6 పరీక్షా కేంద్రాలను సందర్శించారు. డీఈవో వెంట ఏసీజీ రవికుమార్ ఉన్నారు.

తెలుగు కవులలో ప్రముఖుడు సిద్దప్ప వరకవి

జనగామ కల్చరల్, మార్చి 23: తెలుగు కవులలో ప్రముఖుడు సిద్దప్ప వరకవి అని కుమ్మర శాలివాహన ప్రజాపతి ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జివిలికపల్లి నరహరి అన్నారు. జనగామ జిల్లా కేంద్రంలో శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో సిద్దప్ప వరకవి వర్ధంతి నిర్వహించారు. జనగామ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్ర రాజధానిలో సిద్దప్ప వరకవి విగ్రహాన్ని, రూ.100 కోట్లతో కుమ్మర ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని, కుమ్మరులకు రాజకీయ పదవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసారం కృష్ణమూర్తి, కొలిపాక సంపత్, దామెర రాంచంద్రం, వంగపల్లి విష్ణు, వెలిశాల యాదగిరి, ఏదునూరి బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

రఘునాథపల్లి, మార్చి 23: మండలంలోని ఖిలాషాపూర్ గ్రామంలో బండి శంకర్ ఇంట్లో శనివారం షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో నిత్యావసర వస్తువులు, సామగ్రి దగ్ధమైంది. దీంతో సుమారు రూ.80వేల ఆస్తి నష్టం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. నిరుపేద శంకర్ కుటుంబానికి ప్రభుత్వం తగిన ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాగా, శంకర్ కుటుంబానికి స్థానిక లైన్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ నిత్యావసర సరకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది వెంకటయ్య ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



యాకయ్య (ఫైల్)

కొడకండ్ల, మార్చి 23: మండలంలోని రామన్నగూడెం వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎంగిలి యాకయ్య(60) అనే వృద్ధుడు హైదరా బాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలి పిన ప్రకారం.. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఆరెగూడెంకు చెందిన ఎంగిలి యాకయ్య కొడకండ్ల మండలంలోని రామవరంలో బంధువు అంత్యక్రియల్లో శుక్రవారం పాల్గొని ఇంటికి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తున్నాడు. అదే సమయంలో విధుల్లో భాగంగా పాలకుర్తి వైపు నుంచి బైక్‌పై వస్తున్న పాలకుర్తి పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ జి.యాకయ్య రామన్నగూడెం వద్ద టీవీఎస్ ఎక్సెల్‌ను ఢీకొన్నాడు. ఈప్రమాదంలో యాకయ్యకు తీవ్ర గాయాలు కాగా, కుటుంబీకులు హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



కొడకండ్లలో శని విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

కొడకండ్ల, మార్చి 23 : మండల కేంద్రంలోని శనైశ్చర దేవాలయంలో శనిత్రయోదశి సందర్భంగా వంశ పారంపర్య పూజారులు పిండిపోలు నాగదక్షిణామూర్తి, మౌర్య ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే శని మూలమంత్ర జపంతో పాటు శని భగవానుడి విగ్రహానికి నువ్వుల నూనెతో అభిషేకం చేశారు. నల్ల నువ్వులు నైవేద్యంగా పెట్టి, శని మూలమంత్ర హోమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పూజారి మాట్లాడుతూ శనిగ్రహ దోష నివారణ పూజలకై పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పాల్గొన్నట్లు తెలిపారు. వివిధ సమస్యలతో బాధపడే వారు శని గ్రహానికి దోష నివారణకై పూజలు చేసినట్లు తెలిపారు.

సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో అవగాహన

జనగామ కల్చరల్, మార్చి 23 : పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి సభ్యులు కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్ సారథ్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు జనగామ బస్టాండు ఆవరణలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళా ప్రదర్శనలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. ఓటు హక్కు పొంది ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవాలన్నారు. డబ్బు, మద్యంకు ఓటును అమ్ముకోరాదని తెలియపరిచారు. కార్యక్రమంలో కళాకారులు జనగామ శంకర్, బానోతు గణేష్, పిస్నింటి రత్నం, పన్నీరు శ్రీనివాస్, కారుపోతుల సోమయ్య, కేమిడి కనకరాజు, బిజ్జూరి చంద్రశేఖర్, అనపర్తి స్వప్న, నల్ల మమత, రంజాన్ బీ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్య పరిరక్షణ

- మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మనోహర్
- ముగిసిన పోషణ పక్వాడ పక్షోత్సవాలు



జఫర్‌గడ్‌లో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి డాక్టర్ మనోహర్



రామవరంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, మార్చి 23 : పోషక విలువలు కలిగిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్య పరిరక్షణకు ఎంతో దోహదపడుతుందని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ మనోహర్, తహసీల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంపీడీవో సుమన్ అన్నారు. జఫర్‌గడ్‌లోని రైతు భవనంలో శనివారం పోషణ పక్వాడ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల్లో పోషక విలువలు ఎక్కువగా ఉంటాయన్నారు. కొర్రలు, సజ్జలు, జొన్నలు, రాగులు తదితర చిరుధాన్యాలతో చేసిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చునన్నారు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన పోషకాహారం, జాగ్రత్తలపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే మండలంలోని కూనూరులో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారం, ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పించారు. ఆహార పంటలు, చిరుధాన్యాలు, ఆకుకూరలు, ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన పోషకాహారంపై గర్భిణులు, మహిళలకు వివరించారు. కాగా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి నిర్వహిస్తున్న పోషణ పక్వాడ పక్షోత్సవాలు శనివారం నాటితో ముగిసాయి. కార్యక్రమంలో ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు మచ్చ శారద, రాజేశ్వరి, రాజకళ, ఉమ, జగదీశ్వరి, నాగమణి, సోమలక్ష్మి, అమృత, కళావతి, రజిని, ఎలిజబెత్, కూనూరులో సుందరి, సంధ్యారాణి, రజిత, ఆయాలు, గర్భిణులు పాల్గొన్నారు.

- లింగాలఘణపురం : మండలంలోని మాణిక్యాపురం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ల సంఘం మండల అధ్యక్షురాలు చౌదరిపల్లి వసంత మాట్లాడుతూ కిశోర బాలికలు, గర్భిణి మహిళలు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంజుల, ఆయాలు పూలమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- రఘునాథపల్లి : పోషకాహారం ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి అందుకు అనుగుణంగా వ్యవహరించాలని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ సరస్వతి అన్నారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాల్లో భాగంగా రఘునాథపల్లిలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కవిత, ఏఎన్ఎం ధనలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, కవిత, రాజమణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.
- కొడకండ్ల : పోషక విలువలు ఉన్న ఆహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాలని తహసీల్దార్ అంజయ్య అన్నారు. మండలంలోని రామవరం రైతు వేదికలో ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ అంజయ్యతో పాటు డీడబ్ల్యూవో జెట్టి జయంతి, మండల వైద్యాధికారి హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. మహిళలు గర్భం ధరించిన నాటి నుంచి ప్రసవమై పిల్లలు కనీసం 6 నెలల వయస్సు వచ్చేవరకు, చిన్నపిల్లలకు, బాలింతలకు చిరుధాన్యాలు. ఆకు కూరలు, పాలు, గుడ్లు, తదితరాల్లో ఉన్న పోషక విలువలపై అవగాహన కల్పించారు. డీడబ్ల్యూవో జయంతి మాట్లాడుతూ బిడ్డ తల్లులు ప్రసవమైన గంటలోపు బిడ్డకు ముర్రు పాలు పట్టించాలని సూచించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం, అన్నప్రాసన, సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు మంగ, రజిత, రేణుక, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌కు తరలిన పెద్ది కృష్ణమూర్తి

అధ్యక్ష పదవి నుంచి తొలగింపుపై అధిష్ఠానానికి ఫిర్యాదు

దేవరుప్పుల, మార్చి 23 : దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి పెద్ది కృష్ణమూర్తిని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి ఇంచార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తొలగించి నూతన అధ్యక్షుడిగా నల్ల శ్రీరామ్‌ను నియమించడంతో గొడవ చివరకు గాంధీ భవన్‌కు చేరింది. కృష్ణమూర్తి పార్టీ ఎదుగుదలకు కష్టపడి అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీ తెచ్చి పెడితే చివరకు ఫలితం ఇదా.. అని దేవరుప్పులలో రెండు రోజులు ఆయన వర్గీయులు నిరసన తెలుపుతూ రాస్తారోకో నిర్వహించారు. మూడవ రోజు కృష్ణమూర్తి అనుచరుడు సెల్ టవర్ ఎక్కి బెదిరింపులకు పాల్పడ్డ విషయం విదితమే. అయితే తనను అకారణంగా తొగించారని శనివారం పెద్ది కృష్ణమూర్తి తన వర్గీయులతో దేవరుప్పులలో భారీ ర్యాలీ నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేయడానికి 50 వాహనాల్లో గాంధీ భవన్‌కు తరలివెళ్లారు. ఝాన్సీరెడ్డికి ఇక్కడ పౌరసత్వం లేకున్నప్పటికీ పార్టీ నియోజకవర్గ ఇంచార్జినని తిరుగుతూ తనను తొలగించిందని గాంధీ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. సానుకూలంగా స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అధ్యక్ష పదవి నుంచి తొలగించడానికి కారణాలు తెలుసుకుని న్యాయం జరిగేలా చూస్తామని కృష్ణమూర్తికి హామీ ఇచ్చారు.



కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న పెద్ది కృష్ణమూర్తి, ఆయన వర్గీయులు

రెవెన్యూ దస్త్రాల భద్రతపై దృష్టి సారించాలి

- కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

లింగాలఘణపురం, మార్చి 23: రెవెన్యూ శాఖకు చెందిన దస్త్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సూచించారు. శనివారం లింగాలఘణపురం మండల తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ధరణి పోర్టల్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్‌తో పాటుగా రెవెన్యూ రికార్డులను సుమారు గంట పాటుగా క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రెవెన్యూ రికార్డుల భద్రత విషయంలో తహసీల్దార్ ప్రత్యేక చొరవ తీసుకుని రికార్డులను మన్నికగా ఉండేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని సూచించారు. శాఖాపరంగా పెండింగ్‌లో ఉన్న రికార్డుల పురోగతిపై తహసీల్దార్ వినయలతకు అవసరమైన సూచనలను అందజేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఈజీఎస్ పనుల నిర్వహణపై ఎంపీడీవో జలందర్‌రెడ్డితో సమీక్షించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పెండింగ్ పనుల వివరాల రికార్డులను పరిశీలించారు. పౌర సేవల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదని, ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండకుండా నిర్దేశిత కార్యాచరణను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. అయితే టీఎస్‌పీఎస్సీకి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగి నకీర్త విజయలక్ష్మికి స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి ఆదాయం సర్టిఫికెట్ అందజేయాలని మీసేవలో దరఖాస్తు చేసుకోగా వివాహితురాలికి పుట్టింటి నుంచి సర్టిఫికెట్ జారీ చేయడం కుదరదని తహసీల్దార్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో దరఖాస్తుదారు విజయలక్ష్మి వెంటనే అక్కడే ఉన్న కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ నిబంధనల ప్రకారం సర్టిఫికెట్ జారీ చేయాలని ఆదేశించడంతో అధికారులు ఆదాయం సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం.



తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

పనిచేసే వారికి సముచిత గౌరవం

- వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 23: పార్టీ కోసం పనిచేసే వారికి సీఎం రేవంత్ రెడ్డి సముచిత గౌరవం కల్పిస్తారని వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన శనివారం మండలంలోని తాటికొండ స్వగ్రామానికి రావడంతో కాంగ్రెస్ శ్రేణులు, అనుచరులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. తాటికొండ గ్రామ పరిధిలోని జీబీ తండా, జిట్టెగూడెం తండా, నారాయణలొద్ది తండా, గాలిగుట్ట తండాలకు చెందిన నాయకులు సుధీర్‌రెడ్డిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను రెండు రోజుల క్రితం సీఎంను కలిసిన సందర్భంలో అనేక విషయాలు చెప్పడం జరిగిందన్నారు. త్వరలోనే ఐదుగురి సభ్యులతో మండల కమిటీల ఏర్పాటు జరుగనుందన్నారు. కమిటీలో స్థానం దక్కాలంటే ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఎవరికి వారు కష్టపడి భారీ మెజారిటీ తీసుకువచ్చేలా పని చేయాలన్నారు. వరంగల్ పార్లమెంట్ స్థానంను కాంగ్రెస్ గెలువబోతుందన్నారు. వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆహ్వానిస్తామని తెలిపారు. త్వరలోనే వేలాది మంది కార్యకర్తలు స్టేషన్‌ఘన్‌పూర్ ఇన్‌చార్జి సింగపురం ఇందిర సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారని సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మారపాక రాములు, పాలకుర్తి నాగరాజు, మోసిన్‌అలీ, శ్రీనివాస్, అనిల్, బొల్లం నాగరాజు, గౌరేష్ పాల్గొన్నారు.



వైస్ ఎంపీపీ సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

యువత భగత్‌సింగ్ బాటలో పయనించాలి

- మాజీ ఎమ్మెల్యే సీహెచ్.రాజారెడ్డి
- విప్లవ వీరులకు నివాళులర్పించిన నేతలు

జనగామ కల్చరల్, మార్చి 23 : దేశ యువత భగత్‌సింగ్ బాటలో పయనిస్తే మతతత్వం మాయమవుతుందని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ జిల్లా కార్యదర్శి సీహెచ్.రాజారెడ్డి అన్నారు. విప్లవవీరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు 93వ వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వారికి ఘనంగా నివాళులర్పించారు. జనగామ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో శనివారం భగత్‌సింగ్ 93వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి గుర్రం మధు అధ్యక్షత వహించగా రాజారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో భారతదేశ యువత ఘన కీర్తిని నాటి బ్రిటిషు ప్రభుత్వానికే కాకుండా ప్రపంచ దేశాలకు తెలియపరిచిన విప్లవ యోధుడు భగత్‌సింగ్ అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జనగామ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, పుప్పాల ఐలయ్య, చామకూర యాకూబ్, దయా నగేష్, సుదర్శన్, వీరస్వామి, గోల్కొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో..

జనగామ జిల్లా కేంద్రంలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విప్లవ వీరులు భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురుల వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు చిలువేరు అభిగౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తమ ప్రాణాలను అర్పించి స్వాతంత్ర్య పోరాటానికి పునాదులు వేసిన మహనీయులన్నారు. వారి మరణం ఎన్ని తరాలు మారినా మరువలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ వారి చరిత్ర తెలుసుకొని రాబోయే తరాలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు కార్తీక్, ధీరజ్, ప్రేమ్, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న రాజారెడ్డి తదితరులు

లైంగిక దాడి ఘటనలో నిందితుడి అరెస్టు

లింగాలఘణపురం, మార్చి 23: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిపై లైంగిక దాడికి పాల్పడ్డ ఘటనలో నిందితుడు యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన సిద్ధారెడ్డిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు లింగాలఘణపురం ఎస్సై సీహెచ్.రాజు తెలిపారు. ఈ నెల 19న సంఘటన జరగగా జనగామ రూరల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఐపీసీ 452, 376 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే నిందితుడు సిద్ధారెడ్డి గతంలో తండ్రిని హత్య చేసిన కేసులో విచారణ ఎదుర్కొంటుండం గమనార్హం.

అంగడి వేలం వాయిదా

నర్మెట, మార్చి 23 : నర్మెట మండల కేంద్రంలో ప్రతీ బుధవారం నిర్వహించే వారాంతపు సంతకు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఎంపీవో అరవింద్‌చౌదరి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. రహదారి, తైబజారుకు వేలం పాట జరుగగా, పలువురు డీడీలు తీసి పాల్గొన్నారు. రహదారి వేలంకు అధికారులు నిర్ణయించిన ధర(అప్‌సెట్ ప్రైస్) రానందున వేలం పాటను వాయిదా వేసినట్లు ఎంపీవో ప్రకటించారు. తైబజారుకు నర్మెటకు చెందిన పులి రాజు రూ.1.11 లక్షలకు(ఒక లక్ష పదకొండు వేలు) అధిక పాట పాడి వేలంను దక్కించుకున్నాడు. ఈ నెల 26న రహదారి వేలం పాటను నిర్వహించనున్నట్లు ఎంపీవో అరవింద్‌చౌదరి తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

బైక్‌లను ఢీకొట్టిన ఆటో

ఇద్దరికి తీవ్ర గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 23 : ముందు వెళ్తున్న రెండు బైక్‌లను అతివేగంతో ఆటో ఢీకొట్టిన సంఘటనలో బైక్‌లపై ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన శనివారం స్టేషన్‌ఘన్‌పూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వినయ్‌కుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం.. మండలంలోని శివునిపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్, పాంనూర్‌కు చెందిన బొమ్మినేని రవీందర్‌రెడ్డి రెండు బైక్‌లపై ఘన్‌పూర్ నుంచి స్వ గ్రామాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో బైక్‌ల వెనుకాల వేగంగా దూసుకొచ్చిన ఆటో రెండు బైక్‌లను ఢీకొట్టింది. దీంతో ప్రవీణ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో పాటు ఎడమ కాలు విరిగింది. శ్రీనివాస్‌రెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంలో క్షతగాత్రులను వాహనంలో వరంగల్ ఎంజీం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ మండల నూతన ప్రతినిధులు వీరే..

జఫర్‌గడ్, మార్చి 23 : పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆదేశాల మేరకు భారతీయ జనతా పార్టీ జఫర్‌గడ్ మండల కమిటీ, అనుబంధ సంఘాల నూతన ప్రతినిధులను నియమించినట్లు మండల కమిటీ అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్‌గౌడ్ శనివారం ఇక్కడ ప్రకటించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా అన్నెపు రమేశ్(రఘునాథ్‌పల్లి), మోడెం అరవింద్‌గౌడ్(తిమ్మంపేట), మండల ప్రధాన కార్యదర్శులుగా సింగారపు రమేశ్(జఫర్‌గడ్), పందిబోయిన రాజు(తమ్మడపల్లి(జి)), గోదారి సాయిరాం(కోనాయిచలం), కార్యదర్శులుగా మచ్చ బాబు (సాగరం), కొనకంటి నాగరాజు(తీగారం), అధికార ప్రతినిధులుగా మారెపల్లి రవి(తమ్మడపల్లి(జి)), చందా రాజు(తిడుగు) నియమితులయ్యారు. అలాగే పార్టీ అనుబంధ విభాగాలైన సోషల్ మీడియా మండల కన్వీనర్‌గా కత్తి సందీప్, గీత సెల్ కన్వీనర్‌గా మేరుగు రామరాజు, మహిళా మోర్చా రడపాక యాకలక్ష్మి, బీజేవైఎం తాళ్లపల్లి సురేశ్, కిసాన్, దళిత, ఓబీసీ, మైనారిటీ, ఎస్టీ మోర్చాల మండల అధ్యక్షులుగా అబ్బరబోయిన యాకస్వామి, గాదెపాక శ్రీను, చీకటి శ్రీనివాస్‌గౌడ్, మహ్మద్ అఫ్జల్, భూక్య సంతోష్ నియమితులైనట్లు నాగేశ్ గౌడ్ తెలిపారు.

జనగామలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి సమక్షంలో శనివారం మండలంలోని వివిధ పార్టీల నాయకులు, ప్రతినిధులు మందపురి గణేష్, నేరెళ్ల రాజు, మోడెం అరవిందగౌడ్, పల్లె సంతోష్‌రెడ్డి తదితరులు బీజేపీ చేరినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా దశమంతరెడ్డి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి అంకిత భావంతో కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి సమష్టిగా పాటుపడాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ప్రతినిధి ఉడుగుల రమేశ్, శివరాజు యాదవ్, రమేశ్, నియోజకవర్గ ఇంచార్జి ఐలోని అంజిరెడ్డి, మండల నేతలు తిరుపతి పాల్గొన్నారు.



దశమంతరెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

పోలీసుల్లో ట్యాపింగ్ టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

ప్రణీత్‌రావుది వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడపల్లి కాగా, ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్న టి.ప్రభాకర్‌రావు కూడా కీలక పాత్రధారియేనని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో గుర్తించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉన్న ప్రభాకర్‌రావు ఇంట్లో సోదాలు నిర్వహించారు. ప్రభాకర్‌రావుది హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామం కాగా 2020జూన్ 30న పదవీవిరమణ చేశారు. అయితే అప్పటి సీఎం కేసీఆర్‌తో ఉన్న సత్సంబంధాలతో ప్రభాకర్‌రావును ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారు. పై అధికారుల ఆదేశాల మేరకే ట్యాపింగ్ చేసినట్లు ప్రణీత్‌రావు పోలీసుల విచారణలో పేర్కొనటంతో ప్రభాకర్‌రావు ఇంట్లో తనిఖీలు చేపట్టడం వరంగల్ పోలీసుల్లో చర్చనీయాంశమైంది. ఇదే చర్చ జరుగుతున్న క్రమంలో భూపాలపల్లి ఏఎస్పీ భుజంగరావు సైతం ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వామ్యమయ్యారని దర్యాప్తు బృందం గుర్తించటంతో పాటు ఆయన అదుపులోకి తీసుకుని విచారిస్తోంది. ఐదు నెలల క్రితమే భుజంగరావు భూపాలపల్లికి బదిలీపై రాగా.. వచ్చినప్పటి నుంచే ట్యాపింగ్ కేసు దర్యాప్తు ప్రారంభం కావటంతో భూపాలపల్లి కంటే ఎక్కువ సమయం హైదరాబాద్‌కే పరిమితమైనట్టు సమాచారం. అలాగే ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో భాగంగా వరంగల్ జిల్లా పర్వతగిరిలో వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు విచారణలో తేలింది. ప్రణీత్‌రావు తన బంధువుల ఇంట్లో ఈ వార్‌రూమ్ ఏర్పాటు చేసి కొందరి సహకారంతో ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఇదే కోణంలో దర్యాప్తు బృందం విచారించి రికార్డు చేసినట్టు తెలుస్తోంది. వరంగల్ కమిషనరేట్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐలు ప్రమేయం ఉందని, వారిని అదుపులోకి తీసుకున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ప్రణీత్‌రావును శనివారం వరకే పోలీసు కస్టడికి కోర్టు అనుమతిచ్చింది. ఈ తక్కువ సమయంలో ఎక్కువ సమాచారాన్ని సేకరించిన దర్యాప్తు బృందం మంగళవారం నుంచి రెండో విడత విచారణ చేపట్టనున్నట్లు సమాచారం. ఈ విడతలో పర్వతగిరి వార్‌రూమ్‌కు సహకరించిన ఖాకీల వివరాలు బయటకొచ్చే అవకాశం ఉందన్న చర్చ జరుగుతుండగా.. ఫోన్‌ట్యాపింగ్ లింకులు ఎవరెవరికి ఉన్నాయోనన్న ఉత్కంఠ మరింత పెరుగుతోంది.

రఘుపతి ఆత్మహత్య కలచివేసింది..

(5వ పేజీ తరువాయి)

రకాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, స్పెషల్ డ్రైవ్‌లో తహసీల్దార్ పరిధిలో 85 ఉండగా 13 పరిష్కారమయ్యాయని 72 పరిశీలనలో ఉన్నట్టు అధికారులు వివరించారు. దీంతో కోర్టులో కేసులు ఉన్నవి తప్ప మిగిలినవి పరిష్కరించాలని కోదండరెడ్డి కోరారు. ఇక రైతు వద్ద లంచం తీసుకున్న సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేషీకి కూడా కోదండరెడ్డి ఫిర్యాదు చేశారు.

దుఃఖంతో పరీక్షకు హాజరైన కూతురు

మండలంలోని పడమటికేశ్వాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి భూ రికార్డుల సవరణకు రెవెన్యూ అధికారులకు డబ్బులు ఇచ్చినా పనులు చేయకపోవడంతో శుక్రవారం బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆయన మృతదేహాన్ని శనివారం ఇంటి వద్ద ఉంచారు. రైతు రఘుపతికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెకు వివాహమైంది. రెండో కుమార్తె ఇంటర్ చదువుతుండగా, మూడో కుమార్తె మహాలక్ష్మి పదవ తరగతి చదువుతుంది. కొన్నె గ్రామంలోని సెంటర్‌లో పరీక్షలు రాస్తోంది. శనివారం గణితం పరీక్ష రాయటానికి మహాలక్ష్మి వెళుతూ తండ్రి మృతదేహం వద్ద నిలబడి తనను ఆశీర్వదించమంటూ రోధించటంతో అక్కడున్న వారు ఒక్కసారి ఘొల్లుమన్నారు. పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసి వచ్చి తండ్రి అంత్యక్రియల్లో పాల్గొంది.



పరీక్షకు వెళ్లే ముందు తండ్రి భౌతికకాయం వద్ద మహాలక్ష్మి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : బీజేపీ

పాలకుర్తి, మార్చి 23 : పార్లమెంటు ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ అన్నారు. పాలకుర్తి మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా మహేందర్, నియోజకవర్గ కోకన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్ హాజరై మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఇతర పార్టీల నుంచి చేరే వారిని బీజేపీలో చేర్చుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల నాటికి నియోజకవర్గంలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త చిత్త శుద్ధితో పని చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, మాజీ అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్, మారం రవి, అమరేందర్, పెనుగొండ సోమేశ్వర్, పిట్టల సైదులు తదితరులు పాల్గొన్నారు.